సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 28 । జనవరి । 2024

అల.. హస్తినాపురిలో



ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో మన యువతులు పాల్గొన్నారు. ప్రతిభ చూపి ఆకట్టుకున్నారు.

- 8లో



బస్సు నుంచి జారిపడి..

బస్సు నుంచి జారిపడి క్లీనర్ మృతి చెందారు. కోటబొమ్మాళిలో ఘటన జరిగింది.

- 8లో

29 నుంచి బీటెక్ మొదటి సెమిస్టర్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ బీటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం తెలిపారు. సోమవారం నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐదు విభాగాలు నుంచి 252 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి శిక్షణ కోర్సులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి పి.బి.సాయిశ్రీనివాస్, ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ స్కిల్ హబ్ సెంటర్‌లో కొత్తగా 'కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కంప్యూటర్' కోర్సులో ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈ నెల 31లోగా వారి సర్టిఫికెట్లు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని వారు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9493290012 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం



శివానీలో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ పరీక్షలు ఎచ్చెర్ల వెంకటేశ్వర, చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీల కేంద్రాల్లో శనివారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల వెంకటేశ్వర కళాశాలల్లో మొదటి షిఫ్ట్‌లో 100కి 98, రెండో షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరయ్యారు. శివానీలో మొదటి షిఫ్టుకు 100కి 96, రెండు షిఫ్ట్‌లో 100కి 100 మంది హాజరయ్యారు. పరీక్షలు నిర్వహణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది.

వాన కృష్ణచంద్‌కు అభినందన



వాన కృష్ణచంద్‌ను అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లా ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇటీవల రాష్ట్ర టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన వాన కృష్ణచంద్‌ను రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి కృష్ణచంద్ అని, ప్రజలకు మంచి సేవలందిస్తూ మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘ నాయకులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ వెంకటేశ్వరరావు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ అండర్-17 సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో శ్రీకాకుళంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీకు చెందిన పి.శివరామకృష్ణ, జెడ్పీహెచ్‌స్కూల్ మందసకు చెందిన ఎం.మణికంఠ ఉన్నారు. ఈ పోటీలు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఔరంగబాద్ వేదికగా జరగనున్నాయి. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు శనివారం తన చాంబర్‌లో అభినందించారు.

● ఎన్నికల సమరానికి సిద్ధం అంటూ..

భీమిలిలోని సంగివలస వద్ద అనిట్స్ కళాశాల మైదానంలో శనివారం 'సిద్ధం' పేరిట వైఎస్సార్ సీపీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున జనం తరలివెళ్లారు. ఎన్నికల ముందు నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగం వినేందుకు జిల్లా నలుమూలల నుంచి అభిమానులు, పార్టీ శ్రేణులు హాజరయ్యాయి.



భీమిలి సభకు బయల్దేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల బస్సులను కోటబొమ్మాళి వద్ద ప్రారంభిస్తున్న పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్



సోంపేట: పార్టీ జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ తదితరులు



పాతపట్నం నుంచి భీమిలి సభకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బగ్గుమన్న విభేదాలు

- నరసన్నటపేట టీడీపీలో టిక్కెట్ కోసం తీవ్రమైన పోరు
- బగ్గు ఫ్యామిలీలో చిచ్చు రేపిన చంద్రబాబు
- ప్రస్తుత ఇన్‌చార్జి రమణమూర్తి స్థానంలో డాక్టర్ శ్రీనివాసరావుపై ఆసక్తి
- టిక్కెట్ ఖరారు చేసేసినట్టు జిల్లా నాయకత్వానికి సమాచారం
- బల ప్రదర్శనకు దిగిన రమణమూర్తి
- అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేయిస్తామంటూ అనుచరుల అల్టిమేటం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

టీడీపీ ఆడిన 'డబ్బు'ల్ గేమ్‌తో నరసన్నపేటలోని ఆ పార్టీ శ్రేణుల్లో విభేదాలు 'బగ్గు'మన్నాయి. టికెట్ల కేటాయింపులో చంద్రబాబు వైఖరి పార్టీని ఇక్కడ రెండుగా చీల్చేసింది. ఇక్కడ టిక్కెట్ పోరు తార స్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తిని పక్కన పెట్టేందుకు అధిష్టానం వ్యూహం రచించింది. ఆయన స్థానంలో శ్రీకాకుళంలో వైద్యుడిగా కొనసాగుతున్న బగ్గు శ్రీనివాసరావును తెరపైకి తీసుకొచ్చింది. ఈయనకే టిక్కెట్ ఖరారు చేసినట్టు కూడా సంకేతాలు పంపించింది. గుట్టు చప్పుడు కాకుండా బగ్గు శ్రీనివాసరావు తండ్రి లక్ష్మణరావు నియోజకవర్గంలో లోపాయికారీగా పనులు చక్కబెడుతున్నారు. ఇది తెలిసి రమణమూర్తి భగ్గుమంటున్నారు. ఆయన అనుచరులైతే ఏకంగా అల్టిమేటం జారీ చేస్తున్నారు. తమ నాయకుడికి టిక్కెట్ ఇవ్వకపోతే బయటకు పోతామని, అవసరమైతే ఇండిపెండెంట్‌గా నిలబెడతా మంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడిది నియోజకవర్గ టీడీపీలో చిచ్చు రేపింది.

పొలిటికల్ పాయింట్

బగ్గు ఫ్యామిలీలో చిచ్చు

నరసన్నపేట టీడీపీలో తొలి నుంచి బగ్గు ఫ్యామిలీయే నాయకత్వం వహిస్తోంది. 1989 నుంచి బగ్గు చేతుల్లోనే టీడీపీ ఉంది. ఇప్పుడు ఈ ఫ్యామిలీలో చంద్రబాబు చిచ్చురేపారు. తొలుత బగ్గు లక్ష్మణరావు పార్టీ నాయకత్వం చేపట్టి, ఒకసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత బగ్గు రమణమూర్తిని ప్రోత్సహించారు. ఆయనొకసారి ఎమ్మెల్యేగా చేశారు. వీరి పనితీరు నచ్చకనో, అనుసరించిన విధానాలను తట్టుకోలేకనో నియోజకవర్గ ప్రజలు వీరికి పెద్దగా అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నియోజక వర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఎన్నికలు వచ్చే సరికి మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు కుమారుడు, శ్రీకాకుళంలో వైద్య వృత్తి చేపడుతున్న శ్రీనివాసరావును అధిష్టానం పెద్దలు తెరపైకి తెచ్చారు.

బల ప్రదర్శన-అల్టిమేటం

శనివారం జలుమూరు మండలంలో బల ప్రదర్శన చేశారు. తన వర్గీయులతో కలిసి ర్యాలీ చేశారు. కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్‌ను పిలిచి తన బలమేంటో చూపించారు. తనకే టిక్కెట్ వచ్చేలా చూడాలని కోరారు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన రమణమూర్తి అనుచరులు అధిష్టానం తీరుపై ధ్వజమెత్తారు. ఎక్కడో ఉన్న డాక్టర్‌కి ఇక్కడ సీటు ఇవ్వడమేంటని మండిపడ్డారు. ఆయనొచ్చి ఇక్కడేం చేస్తాడని, డబ్బులున్నాయని టిక్కెట్ ఇచ్చేస్తే ఊరుకుంటామా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకే టిక్కెట్ ఇస్తే ఎన్నికల్లో పనిచేయమని, బయటికి పోతామని, అవసరమైతే ఇండిపెండెంట్‌గానైనా రమణమూర్తిని నిలబెడతామని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు రెండుగా చీలిపోయి ఛాలెంజ్ చేసుకునే పరిస్థితి ఏర్పడింది. బగ్గు రమణమూర్తి చేసిన బల ప్రదర్శనకు బగ్గు లక్ష్మణరావు వర్గం హాజరు కాలేదు. దాదాపు దూరంగా ఉండిపోయింది. ఇదంతా చూస్తుంటే టీడీపీలో ముస్ముందు ముసలం తప్పదని తెలుస్తోంది.

డబ్బే పరమావధి

ప్రస్తుతం టిక్కెట్ల కేటాయింపులో డబ్బును మాత్రమే టీడీపీ పరమావధిగా చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరు డబ్బులు ఎక్కువగా ఇవ్వగలరు, ఎవరు ఖర్చు పెట్టగలరో అడుగుతూ వైద్యుడు బగ్గు శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు దాదాపు ఖరారు చేసేశారు. ఇప్పటికే జిల్లా పార్టీ నాయకత్వానికి సమాచారం కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా బగ్గు రమణమూర్తికి ఈసారి టిక్కెట్ ఉండదని సూచన ప్రాయంగా పార్టీ కేడర్‌కు చెప్పేశారు. ఇక బగ్గు శ్రీనివాసరావును కూడా గో హెడ్ అని చెప్పడంతో ఆయన తండ్రి లక్ష్మణరావు రంగంలోకి దిగి నియోజకవర్గంలో లోపాయికారీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ నోటా, ఈనోటా ఆ మాట విన్న బగ్గు రమణమూర్తి అప్రమత్తమయ్యారు. బగ్గు శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని, తనకే టిక్కెట్ వస్తుందని కేడర్ జారిపోకుండా సమర్థించుకుని నచ్చచెబుతున్నారు. కాకపోతే శ్రీనివాసరావుకే టిక్కెట్ ఖరారైపోయిందని నియోజకవర్గమంతా ప్రచారం జరగడంతో బగ్గు రమణమూర్తి బల ప్రదర్శనకు దిగారు.

బడిలో మధ్యాహ్న భోజనంపై ఆరా

నరసన్నపేట: 'పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది. మీ పిల్లలు బాగానే తింటున్నారా. స్కూల్లో భోజనం గురించి మీతో ఏం చెబుతున్నారు..' అంటూ ఎస్ఎస్ఏ సోషల్ ఆడిట్ టీమ్(విజయవాడ) సభ్యులు సూర్య, విద్యా సాగర్‌లు విద్యార్థుల తల్లిదండ్రులను ఆరా తీశారు. వారు శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కేవిటి ఉమ, కేవిటీ భూదేవి మాట్లాడుతూ స్కూల్‌లో భోజనాలు బాగున్నాయని, ఇంటిలోనూ ఇలాంటివే పెట్టాలని పిల్లలు అడుగుతున్నారని తెలిపారు. దీంతో ఆడిట్ టీమ్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.



విద్యార్థుల తల్లులతో కలసి భోజనం చేస్తున్న ఎస్ఎస్ఏ సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు

హెవీ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ 15వ బ్యాచ్‌ని ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీలో డ్రైవింగ్‌లో ఉత్తమ శిక్షణ, మెలకువలు నేర్పించి ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అలాగే డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉన్నందున ఇలా ఆర్టీసీలో శిక్షణ తీసుకుంటే మిగతా అన్ని విభాగాల్లో అవకాశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



ఎ.విజయ్‌కుమార్

'లోక్ అదాలత్‌తో సత్వర సేవలు'



లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సేవా రంగాల్లో లోపాలకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణ రాజు అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులతో ప్రజా ప్రయోజన సేవలు, ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి పౌరుడు న్యాయం పొందే హక్కు కల్పించిందన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందని, ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని, తీర్పు వెలువడ్డాక పై కోర్టుకు అప్పీల్ అనేది ఉండదని స్పష్టం చేశారు. ఆయా సేవలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా శాఖలకు ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతిరావు, ఏపీఎస్ఆర్టీసీ నుంచి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలికలపై లైంగికదాడులు, హింసను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని తీసుకువచ్చారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం సమావేశ మందిరంలో శనివారం జిల్లా లీగల్ సెల్ విభాగం ఏర్పాటు చేసిన పోక్సో చట్టం అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ చట్టంపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో క్రైమ్ రేటు పరిశీలిస్తే మహిళలపై వేధింపులు, ఇతర వివక్ష కేసులు కొంతవరకు తగ్గాయని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయమూర్తులు కె.శ్రీదేవి, పి.భాస్కరరావు, ఎస్ఎం ఫణికుమార్, ఎం.అనురాధ పాల్గొన్నారు.

ఆస్పత్రికి కొత్త జన్మ

- కొత్తూరు సీహెచ్‌సీలో పెరిగిన వైద్య సేవలు
- నెలకు దాదాపు వంద ప్రసవాలు
- రోజుకు 200 వరకు ఓపీ
- పూర్తిస్థాయి సిబ్బందిని నియమించిన ప్రభుత్వం



కొత్తూరు సీహెచ్‌సీలో అధునాతన ఆపరేషన్ థియేటర్

కొత్తూరు:

కాబోయే అమ్మలకు.. కొత్తూరు సీహెచ్‌సీ పునర్జన్మనిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులపై ఉన్న చెడు అభిప్రాయాలను చెరిపేస్తూ.. ప్రభుత్వ సాయాన్ని అందుకుంటూ రోగులకు అండగా నిలుస్తోంది. ఇక్కడ నెలకు దాదాపు వంద ప్రసవాలు జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. మరీ ముఖ్యంగా గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులను కాదని మరీ ఇక్కడే ప్రసవాలు చేయించుకుంటున్నారు. కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైఎస్సార్‌సీపీ పాలనలో కొత్త జన్మ ఎత్తింది. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు నూతనంగా వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించారు. దీంతో కార్పొరేట్‌కు ధీటుగా ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో కొత్తూరు సీహెచ్‌సీకి వైద్య నిపుణులు కూడా వచ్చారు. జనరల్ మెడిసిన్(ఎండీ), జనరల్ సర్జన్(ఎంఎస్), గైనకాలజిస్టు, ఇద్దరు చిన్నపిల్లలు వైద్యులు, ఎనస్థీషియాలజిస్ట్, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్టు, ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులను ప్రభుత్వం నియమించింది. సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్లు కలుపుకుని ఇక్కడ నెలకు వంద వరకు డెలివరీలు జరుగుతున్నాయి. రోజుకు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఇక్కడ ఒకే ఒక్క వైద్య నిపుణుడితో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు మాత్రమే ఉండేవారు. దీంతో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా.. కొత్తూరు సీహెచ్‌సీకి అదనపు భవనాల నిర్మాణం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.పది కోట్లు కేటాయించారు. పనులు 80 శాతం పూర్తయ్యాయి.





కొత్తూరు సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న గైనికాలజిస్టు అనురాధ

కార్పొరేట్‌కు దీటుగా..

రోగులు, గర్భిణులకు పూర్తి స్థాయి వైద్యం అందించేందుకు అవసరమైన వైద్య నిపుణులను ప్రభుత్వం నియమించింది. దీంతో సీహెచ్‌సీలో కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందిస్తున్నాము. రోజుకు సుమారు 200లకు దాటి ఓపీ, 30 వరకు ఇన్‌పేషెంట్‌లకు వైద్యం అందిస్తున్నాం.

– ధర్మాన కిశోర్, జనరల్ మెడిసిన్ ఎండీ, సూపరింటెండెంట్

వైద్యం బాగా అందించారు



ప్రసవం సమయంలో వైద్యం బాగా అందించారు. ప్రైవేట్ ఆస్పత్రుల కంటే ఎంతో నాణ్యమైన వైద్యం అందించారు. గదులు ఎంతో సదుపాయంగా ఉన్నాయి. శ్రీకాకుళంలో కూడ ఇలాంటి వైద్యం అందించరు. ప్రసవ సమయంలో వైద్యురాలితో పాటు వైద్య సిబ్బంది నా దగ్గర ఉండి సేవలు అందించారు. – పట్ట షాలిని, బాలింత

సీఎం జగన్ చొరవతోనే..



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చొరవతోనే ఆస్పత్రిలో సమూల మార్పులు జరిగాయి. అందులో భాగంగా కొత్తూరు సీహెచ్‌సీలో వైద్య నిపుణులను నియమించారు. గతంలో ఎప్పుడూ ఇంత మంది వైద్యులు లేరు. వైద్యులతో పాటు వైద్య సిబ్బందిని నియమించడంతో వైద్య సేవలు మెరుగుపరుగుపడ్డాయి. ఎనస్థీషియాలజిస్ట్ కూడా నియమించడంతో సకాలంలో నాణ్యమైన వైద్యం అందుతోంది.

– పొట్నూరు మధుబాబు, కొత్తూరు



కొత్తూరు సీహెచ్‌సీలో రూ.పది కోట్లతో నిర్మిస్తున్న అదనపు భవనాలు

క్లుప్తంగా

జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్‌ఐల బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ (రెవెన్యూ) విభాగానికి సంబంధించి సబ్ ఇన్‌స్పెక్టర్లను స్థానచలనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వచ్చిన మేరకు జిల్లాకు సంబంధించి ఆ శాఖ నుంచి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వీరిలో ఆరోమో ఏపీఎస్‌బీసీఎల్ శ్రీకాకుళం నుంచి సీహెచ్ రాజశ్రీ, వీవీ జోగారావు, పి.రాజేశ్వరరావు, బి.అప్పారావులు ఆరోమో విశాఖపట్నం-2, ఆరోమో ఏపీఎస్ బీసీఎల్ అనకాపల్లి ఇద్దరు, ఈఎస్ స్క్వాడ్ విశాఖపట్నం ఒకరు బదిలీ కాగా డి.గంగాధర్ ఏపీఎస్‌బీసీఎల్ వింగ్ శ్రీకాకుళం నుంచి ఆరోమో ఏపీఎస్‌బీసీఎల్ విశాఖపట్నం-1కు, ఎల్.మల్లేశ్వరరావు ఎ.సి విజిలెన్సు శ్రీకాకుళం నుంచి డీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. అలాగే అనకాపల్లి ఏపీఎస్‌బీసీఎల్ నుంచి పీబీవీఎస్ఎన్‌మూర్తి, ఎం.వేణులు ఆరోమో ఏపీఎస్‌బీసీఎల్ ఎచ్చెర్లకు, ఎల్ అరుణ్ కుమార్ జెర్రిపోతులపాలెం నుంచి ఏసీ విజిలెన్సు వింగ్ శ్రీకాకుళం, పి.రాజగోపాలరావు డీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ విశాఖపట్నం నుంచి ఎచ్చెర్ల ఏపీఎస్‌బీసీఎల్‌కు, వై.కిరణ్‌కుమార్ వెల్లంకి ఏపీఎస్‌బీసీఎల్ నుంచి ఏసీ విజిలెన్సు వింగ్ శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు.

సమయ పాలనపై అన్ని విభాగాలకు ఉత్తర్వులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమయ పాలనకు సంబంధించిన ఉత్తర్వులు అన్ని విభాగాలకు శనివారం అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ట్స్, సైన్స్, లా, ఇంజినీరింగ్ అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు కచ్చితంగా సమయ పాలన పాటించాలని, లేదంటే నిబంధనలకు లోబడి చర్యలు తప్పవని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ పనిచేస్తుందని, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవా సదన్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో శనివారం జెండర్ సెన్సిటైజేషన్, పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరిగితే ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆమదాలవలస, పాలకొండ, సోంపేట, పాతపట్నం, నరసన్నపేట,టెక్కలి, పలాస, రాజాం,కొత్తూరు, పొందూరు, కోర్టుల న్యాయ మూర్తులు, కోర్టుల సిబ్బంది వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయ మూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర ఫణి కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ అనురాధ, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆర్.సన్యాసినాయుడు, మెజిస్ట్రేట్‌లు భరణి, కందికట్ల రాణి, శారదాంబ ఇంటర్నెట్ కంప్లైంట్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

అల..హస్తినాపురిలో

- ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సత్తాచాటిన జిల్లా యువతులు
- గేదెల భాగ్యలక్ష్మి బైక్ విన్యాసాలు
- ఎన్ఎస్ఎస్ వలంటీర్ల విభాగంలో పాల్గొన్న బమ్మిడి రంజిని



ఎచ్చెర్ల క్యాంపస్:

దేశ రాజధాని వేదికగా మన యువతుల ప్రతిభ వ్యక్తమైంది. న్యూ ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు వేర్వేరు విభాగాల్లో పాల్గొని సత్తా చాటారు. ఎచ్చెర్ల మండలం అజ్జరాంకు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ గేదెల భాగ్యలక్ష్మి బైక్‌తో విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం వలంటీర్ బమ్మిడి రంజిని ఉత్తరాంధ్రలో ఎంపికైన ఒకే ఒక విద్యార్థినిగా గణతంత్ర వేడుకల్లో తన ప్రతిభ కనబరిచింది.

సాహస వనిత

అజ్జరాం గ్రామానికి చెందిన గేదెల భాగ్యలక్ష్మి డిగ్రీ వరకు చదువుకుంది. రెండేళ్ల కిందట సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. తండ్రి అప్పారావు ఆటో డ్రైవర్ కాగా, తల్లి ధనలక్ష్మి గృహిణి. కుమార్తెను నచ్చిన రంగంలో వారు ప్రోత్సహించారు. ప్రస్తుతం ఈమె అస్సోంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. తోటి సీఆర్‌పీఎఫ్ బృందంతో కలిసి బైక్‌తో సాహస విన్యాసాలు చేసి ఆకట్టుకుంది. తనలోని ధైర్యం, బైక్ నడిపే నైపుణ్యం, ఫిట్‌నెస్ ఆధారంగా రిపబ్లిక్ పరేడ్‌కు అధికారులు ఎంపిక చేసి, ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నిరంతర సాధన వల్ల ఈ విన్యాసాలు చేయగలిగామని అన్నారు.



తన బృందంతో నిర్వహిస్తున్న బైక్ సాహస విన్యాసాలు (ఇన్‌సెట్లో) సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ భాగ్యలక్ష్మి

ఉత్తరాంధ్రలో ఒకే ఒక్కరు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో జాతీయ సేవా పథకం విభాగంలో ఢిల్లీలోని రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన ఒకే ఒక వలంటీర్ బమ్మిడి రంజిని. ఈమెది సంతబొమ్మాళి మండలం ఆనందపురం కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్స్ సైన్స్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. రాష్ట్రస్థాయి ఎంపికల్లో ఈ విద్యార్థిని ఎంపిది. ఢిల్లీలో యువజన సర్వీసుల శాఖ జనవరి 1 నుంచి 25వ తేదీ వరకు ఇచ్చిన శిక్షణలో పాల్గొని, అనంతరం పరేడ్‌కు హాజరైంది. పరేడ్ అనంతరం నూతన పార్లమెంట్ సందర్శన, రాష్ట్రపతి భవన్‌లో ప్రముఖులతో విందులో పాల్గొంది. రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఈ విద్యార్థిని 2023 ఆగస్టు 1వ తేదీన పార్లమెంట్ సందర్శించింది. జాతీయ స్థాయి యోగా పోటీల్లో సైతం పాల్గొంది. వరుసగా రెండేళ్లలో రెండు సార్లు పార్లమెంట్‌ను సందర్శించే అవకాశం ఈ విద్యార్థినికి లభించింది. తాను పలు అంశాల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షలు అధిగమించి ఎంపికయ్యానని ఆమె తెలిపింది. రాష్ట్రం తరఫున వెళ్లిన 10 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో ఆమె కూడా ఒకరు. కొత్త పార్లమెంట్ భవనం సందర్శన మంచి అనుభూతిని ఇచ్చిందని ఆమె చెప్పారు.





రాష్ట్రం నుంచి ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో రంజిని (ఇన్‌సెట్లో) రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొన్న రంజిని

జిల్లాలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అత్యున్నత ప్రమాణాలతో అత్యాధునిక సౌకర్యాలతో జిల్లాలో త్వరలోనే క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో రూ.25లక్షలతో నిర్మించిన శాంతాకల్యాణ్ అనురాగ నిలయం రక్షిత గృహం(బాలుర), సీవీ నాగజ్యోతి ఆనందనిలయం(పురుషుల వృద్ధాశ్రమం)లను శనివారం సాయంత్రం ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే జిల్లావాసులతో పాటు సరిహద్దులోని ఒడిశా వాసులకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఏడున్నర ఎకరాల స్థలం సేకరించినట్లు తెలిపారు. త్వరలోనే అనుమతులు వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. అలాగే ఆటిజం కోసం ప్రత్యేక చికిత్స కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గవర్నర్ చేతుల మీదుగా రెండు సార్లు తాను అవార్డు అందుకోవడం రెడ్‌క్రాస్ బృందం సహకారం వల్లనే సాధ్యమైందని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవా దృక్పథం చాలా బాగుందని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఇక్కడ వృద్ధాశ్రమం, బాల,బాలికల రక్షిత గృహం ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీవీఎస్ మూర్తి, డాక్టర్ పీఎల్ఎస్ రాజు, కనుగుల దుర్గా శ్రీనివాసరావు, ఎన్‌పీసీఎల్ వైస్ ప్రెసిడెంట్ వరదరాజులు, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రసాదరావు, పి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: జీడి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంకల పాపయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి కోరారు. మండలం గరుడబద్ర పంచాయతీ పరిధిలో గల మద్రిపాడులో శనివారం ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి మామిడి పంటపై వేలాది మంది ఉద్దాన రైతులు ఆధారపడి బతుకుతున్నారని, వారు కష్టపడి పండించిన పంటకు ధర లేకపోవడంతో దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు ప్రధాన మోదీ ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. రైతులను ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు సౌర రామారావు, మురిపింటి యరకయ్య, గూడ లక్ష్మమ్మ, పాపయ్య, కూర్మారావు తదితరులు ఉన్నారు.

కార్డు మార్చి రూ.1.30లక్షలకు టోకరా

మందస: బోరు మెకానిక్‌గా పని చేస్తున్న యాదవరావు ఏటీఎంలో మోసపోయి రూ.1.30 లక్షలు పోగొట్టుకున్నారు. సోంపేట మండలంలోని తాళ్లభద్ర గ్రామానికి చెందిన బూరగాన యాదవరావు మందసలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో బోర్ మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఆయన వద్ద గల ఆంధ్రాబ్యాంక్ ఏటీఎం కార్డు నుంచి నగదు విత్‌డ్రా చేయడానికి హరిపురంలోని ఓ ఏటీఎం కేంద్రానికి వెళ్లారు. ఆపరేటింగ్ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి యాదవరావుతో మాట్లాడుతూ కార్డును మార్చి కాజేశాడు. అనంతరం నగదు విత్‌డ్రా అయినట్టు మెసేజ్ రావడంతో యాదవరావు అవాక్కయ్యారు. బ్యాంకు సిబ్బంది సాయంతో సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తే.. తన కార్డు తీసుకున్న వ్యక్తి తారుమారు చేసి, వేరే కార్డు ఇచ్చినట్టు గుర్తించారు. సంఘటనపై బాధితుడు మందస పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

బస్సు నుంచి జారిపడి క్లీనర్ మృతి

కోటబొమ్మాళి:

ప్రయాణిస్తున్న బస్సు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి క్లీనర్ ఉప్పాడ లక్ష్మణరావు మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన ఉప్పాడ లక్ష్మణరావు ఒక ప్రైవేటు బస్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్నారు. అదే బస్‌కు లక్ష్మణరావు అన్నయ్య ధనుంజయరావు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం కోటబొమ్మాళి నుంచి బయల్దేరిన బస్ ఇండియన్ బ్యాంకు సమీపంలోకి వచ్చేసరికి డోర్ దగ్గర నిల్చున్న క్లీనర్ లక్ష్మణరావు ప్రమాదవశాత్తు జారి పడిపోయి అమాంతం టైరు కిందకు వెళ్లిపోయారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య శాంత కుమారి, కుమార్తె పవిత్ర, కుమారుడు జగదీష్ ఉన్నారు. మృతదేహానికి కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.


మేడపై నుంచి జారిపడి బాలుడు మృతి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన నీలాపు రామకృష్ణ కుమారుడు లీలా మోహన్(15) ఈనెల 24 వ తేదీన తమ ఇంటి మేడపై ఆడుతూ ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానిక సామాజిక ఆస్పత్రికి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి లీలామోహన్ మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పరిధి బైపాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫరీదుపేటకు చెందిన అంపోలు చిట్టిబాబు(65) మృతి చెందారు. రోడ్డు దాటుతుండగా, శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో చిట్టిబాబు సంఘటన స్థలంలో మృతి చెందాడు. పోలీసుల కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మరింత బాధ్యతగా ఉండాలి : ఎస్పీ





ఎస్పీని కలిసిన జి.వాయునందన్‌యాదవ్, ఎల్.రామకృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : సబ్‌ఇన్‌స్పెక్టర్ నుంచి ఇన్‌స్పెక్టర్లుగా నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన సీఐలు బాధ్యతతో పనిచేసి పోలీస్ శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఆమదాలవలస కొత్త సీఐ జి.వాయునందన్‌యాదవ్, అలాగే నూతన సీఐలు ఎల్.రామకృష్ణ, ఎ.లక్ష్మణరావులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ ఎక్కడ పనిచేసినా ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలని, ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రామకృష్ణ, లక్ష్మణరావు విశాఖ రేంజి కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు.

పాన్ షాపులో చోరీ



తొలగించిన షాపు రేకును చూపిస్తున్న షాపు యజమాని

సారవకోట: మండల కేంద్రంలోని బజారు వీధిలో శుక్రవారం రాత్రి పాన్ షాపులో చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన నాగరాజు, వెంకట రాజులకు చెందిన పాన్ షాపు వెనుక భాగంలో ఉన్న రేకు తొలగించి కొంత మంది షాపులోకి చొరబడి షాపులో ఉన్న కొంత నగదు, వస్తువులు తీసుకెళ్లినట్లు షాపు యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. సమీపంలో ఉన్న మెడికల్ షాపు బయట ఉన్న సీసీ కెమెరాను కూడా పగలగొట్టారు.

పెద్దలింబుగాంలో జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్

మందస: అంబుగాం పంచాయతీ పెద్దలింబుగాంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు యువత, గ్రామపెద్దలు ఒక ప్రకటనలో చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులను రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలుతో పాటు షీల్డ్‌లు కూడా అందజేస్తామన్నారు. బెస్ట్ రైడర్, డిఫెండర్, ఆల్‌రౌండర్ అవార్డులు కూడా అందిస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే టీమ్‌లు ఈ నెల 31వ తేదీలోగా 9704951637, 7569469540, 8790579391 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



శంబాం పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని హడ్డుబంగి, ఉప్పరజమ్మి, శంబాం పోలింగ్ కేంద్రాల్లోని వసతులను శనివారం ఆమె పరిశీలించారు. మరుగుదొడ్లు లేనిచోట వెంటనే నిర్మించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ నరసింహమూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రజాక్షేమం కోసం పాస్టర్ల ప్రార్థన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డగ్లస్ స్కూల్ ఆవరణలో గల కీస్టోన్ చర్చిలో శనివారం జిల్లాలోని అన్ని మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీల సర్వసభ్య సమావేశం జరిగింది. పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డీఎస్‌వీఎస్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐకమత్యంతో మెలిగి ఉండాలని, ఎవరు సహాయం వస్తారో వారి కోసం ప్రార్థించాలని అన్నారు. అనంతరం దేశం కోసం, నాయకుల కోసం, ప్రజల కోసం ప్రార్థనలు చేశారు. చైర్మన్‌గా మళ్లీ డీఎస్‌వీఎస్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టి.ఆంద్రుస్, సుధాకర్, అబ్రహం, జీవన్, కృపాకరం, జాన్ డేవిడ్, బర్నాబాస్, 30 మండలాల నుంచి సభ్యులు పాల్గొన్నారు.



పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు